ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శనివారం 4 మే 2024





షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలు





నర్సాపూర్‌లో నిర్వహించిన రోడ్డుషోలో ప్రజలకు అభివాదం చేస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, రోడ్‌షోకు తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హామీలన్నీ అమలు చేసి తీరుతాం

- బీఆర్ఎస్, బీజేపీను నమ్మి మోసపోవద్దు
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నర్సాపూర్, మే 3 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేసి తీరుతామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలంమధుకు మద్దతుగా నర్సాపూర్‌లో శుక్రవారం రోడ్‌షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, ఇతర హామీలను కూడా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టత ఇచ్చారని తెలిపారు. అయినా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పెళ్లయిన నాలుగు నెలలకే పిల్లలు లేరని అడిగినట్లు.. వారి తీరు ఉందని ఎద్దేవా చేశారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థికి 20 వేల మెజారిటీ ఇవ్వాలని కోరారు. 50వేలకు పైగా మెజారిటీ ఇస్తే నియోజకవర్గానికి ఏం కావాలన్నా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తీసుకువచ్చే బాధ్యత తన దేనని హామీ ఇచ్చారు. అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలంటే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి, కేరళ సీనియర్ ఎంపీ సురేష్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రాతినిధ్య వహించిన మెదక్ స్థానానికి దేశంలోనే ప్రత్యేక పేరుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎంపీగా అవకాశమిస్తామని నమ్మించి బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు డి.ఆంజిగౌడ్, ఎంపీటీసీ సంధ్యచత్రునాయక్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, ఉదయ్, హబీబ్ ఖాన్, రిజ్వాన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

లీజు వసూలులో జాప్యమేల?

- మల్లన్న ఆలయవర్గాల తీరుపై భిన్నాభిప్రాయాలు
- ఆలయ ఆదాయానికి గండి

చేర్యాల, మే 3 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ లీజు రుసుము వసూలులో ఆలయవర్గాలు జాప్యం వహిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ పరిధిలోని టీటీడీ సత్రం ఆవరణ నుంచి రాతిగీరెల వరకు 26 దుకాణాలున్నాయి. వీటి ని లీజుకు ఇవ్వడానికి యేటా వేలంపాటలు నిర్వహించేవారు.



ఆలయ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల వద్ద సందడి

జాతర జరిగే మూడునెలలపాటు వ్యాపారం కొనసాగినా, మిగతా రోజుల్లో గిట్టుబాటు కాక ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వేలంపాటల్లో పాల్గొనకపోవడంతో ఆదాయానికి గండిపడుతూ వచ్చేది. కొన్నాళ్లక్రితం మూడేళ్ల లీజుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా షాపు నెం.1-20 వరకు యేటా రూ.75వేలు, షాపు నెం.21-26వరకు రూ.95వేలు చొప్పున లీజుకు ఇచ్చారు. యేటా ఆర్థికసంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ మొదటి వారంలోగా లీజు వసూలు చేయాల్సి ఉంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి పలువురు బకాయి ఉండగా, 2024-25 సంవత్సరానికి సంబంధించిన రుసుము నెల క్రితమే వసూలు చేయాల్సి ఉంది. . కానీ ఆలయవర్గాల నిర్లక్ష్యం వహిస్తుండటం వలన పలువురు మళ్లీ జాతర సమయంలోనే చెల్లించే ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే ఆలయంలో ఇతర విభాగాలకు నిర్వహించిన వేలం పాట డబ్బు సకాలంలో చెల్లించకపోవడంతో నిర్వహణపై ప్రభావం చూపుతుంది. ఆలయాధికారులు కనీసం ఆలయానికి చేకూరే ఆదాయంపైనైనా దృష్టిసారించకపోవడం, జాతర ముగిసి నెలరోజులు కావస్తున్నా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు ఉసూరుమంటున్నారు. ఇకనైనా నిర్లక్ష్యం వీడి లీజు రుసుము వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

గజ్వేల్, మే 3: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నమైన శివరాములు తన పొలంలోని మిర్చి పంటకు నీళ్లు పెట్టి వస్తానని గురువారం సాయంత్రం వెళ్లి రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. అతని భార్య భాగ్య ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తన తమ్ముడు గణేశ్‌కు రాత్రి 10.30 గంటలకు విషయాన్ని తెలిపింది. అతను వెళ్లి చూడగా అప్పటికే శివరాములు ట్రాక్టర్ సైలెన్సర్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. పంటసాగుకు, కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చే మార్గం లేక, మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భాగ్య ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.



శివరాములు

ఎన్నికల విధుల్లో తప్పులు జరగొద్దు

- సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 3: లోక్‌సభ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ దిశానిర్దేశం చేశారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లాలోని పీవోలు, ఏపీవోలు, పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు పీవోలు తీసుకోవాల్సిన చర్యలు, బాధ్యతలను వివరించారు. మాక్ పోలింగ్ ఉదయం 5:30 గంటల లోపు పూర్తి చేయాలని, కనీసం ఇద్దరు ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకొని, పోలింగ్ పూర్తయిన అనంతరం సాయంత్రం తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీవోలేదని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం నిర్దేశించిన విధంగా రిపోర్టు తయారు చేయాలని సూచించారు.

నివేదికలు సమర్పించాలి

ఎంసీసీ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమ నగదు, మద్యం జప్తు, అభ్యర్థుల ఖర్చు వివరాలు, 1950 టోల్‌ఫ్రీ నంబర్, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రతీరోజు సకాలంలో నివేదికలను సమర్పించాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పరిశీలన

కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారం-13ఏ, ఫారం-13బీ, ఫారం-13సీలను సరిచూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ముందే సమాచారం ఇచ్చామన్నారు. ప్రతీ ఉద్యోగి తన విలువైన ఓటును వినియోగించుకోవాలని సూచించారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

- సిద్దిపేటలో అభివృద్ధి జరగలేదంటావా?
- సీఎంగా ఈ ప్రాంతానికి నువ్వేమి చేస్తావో చెప్పలేదు
- మా వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు ఎత్తుకెళ్లావు
- రూ.150 కోట్ల అభివృద్ధి నిధులను రద్దు చేయించావు
- ఇప్పుడేమో సిద్దిపేట జిల్లాను తొలగించే కుట్ర
- నేను నర్సాపూర్‌లో ఉంటే ఇంట్లో ఉన్నట్లు చిల్లరమాటలు
- ప్రజలారా కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పండి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే 3 : సిద్దిపేట నడిగడ్డపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేటలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆయన మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గడిచిన పదేళ్లలో నిధులన్నీ సిద్దిపేటకే తీసుకెళ్తున్నారని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో మతిమరుపు వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. సిద్దిపేటకు తాను, కేసీఆర్ ఏమి చేయలేదో చెప్పాలన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో సిద్దిపేట పేరు లేకుండా అవార్డుల జాబితా ఉండేది కాదని చెప్పారు. దేశవిదేశాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వేలాది మంది సందర్శకులు ఇక్కడి అభివృద్ధిని వేనోళ్ల పొగిడారని గుర్తుచేశారు. కొత్త జిల్లా, గోదావరి నీళ్లు, పోలీస్ కమిషనరేట్, మెడికల్ కాలేజీ, కోమటిచెరువు పర్యాటకం, ఐటీ హబ్, రోడ్లు, పచ్చదనం, విస్తృతమైన ప్రగతిని ఎవరు సాధించారో ప్రజలకు తెలుసన్నారు. నీ అబద్ధాలు చూసి ప్రజలు నవ్వుకున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

సీఎం కాగానే సిద్దిపేటకు అన్యాయం

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నించారని గుర్తుచేశారు. ప్రగతిలో ఉన్న వెటర్నరీ కళాశాల పనులను ఆపించి కొడంగల్‌కు తరలించడం నిజం కాదా? అని ప్రశ్నించారు. సిద్దిపేట ప్రాంతానికి సంబంధించి రూ.150 కోట్ల అభివృద్ధి నిధులను రద్దు చేసింది నిజం కాదా? అని అడిగారు. ఈ ప్రాంత విద్యార్థులకు, ప్రజలకు అన్యాయం చేసేలా రేవంత్‌రెడ్డి చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. సీఎం హోదాలో మొదటి సారి సిద్దిపేటకు వచ్చి ఏమిస్తావో, ఏం చేస్తారో చెప్పకుండా అబద్ధాలు మాట్లాడి వెళ్లిపోవడమేమిటని దుయ్యబట్టారు. .

జిల్లా రద్దవుతుంది

రాష్ట్రంలోని కొత్త జిల్లాలను రద్దు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. అందులో భాగంగానే సిద్దిపేట జిల్లాను కూడా రద్దు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. నాలుగు దశాబ్దాల కలను కేసీఆర్ సాకారం చేస్తే కొత్త సీఎం మాత్రం సిద్దిపేట కడుపుకొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహించారు. జిల్లాను రద్దు చేస్తే సహించేది లేదని మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటేసినట్లయితే తప్పనిసరిగా రద్దు చేస్తారని, బీజేపీకి ఓటేసినా జిల్లాకు గ్యారంటీ ఉండదని వివరించారు. అందుకే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించుకుంటే మన జిల్లా భద్రంగా ఉంటుందని తెలిపారు. కొత్త జిల్లాకు కలెక్టర్‌గా ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి వెంకట్రామారెడ్డి అని గుర్తు చేశారు.

ఆ టైంలో నేను ఇంట్లో లేను

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఓ విషయంలో తనస్థాయి దిగజారి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎంత పచ్చి అబద్ధాలు, చిల్లర మాటలు మాట్లాడారో ఈ ఒక్క విషయంతోనే అర్థం చేసుకోవాలని సూచించారు. సిద్దిపేటలో రేవంత్ మాట్లాడుతూ క్యాంపు ఆఫీస్‌లోనే హరీశ్‌రావు ఉన్నాడని వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని చెప్పారు. ఆ సమయంలో తాను నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండలం దౌల్తాబాద్ రోడ్‌షోలో భారీ జనసందోహం నడుమ ఉన్నానని వివరించారు. ఒక సీఎం స్థాయిలో ఆయనకు ఆ మాత్రం ఇంటెలిజెన్సీ కూడా లేదా అని ఎద్దేవా చేశారు. తాను ఎక్కడున్నానో తెలుసుకోవడం రేవంత్‌రెడ్డికి కష్టమైన పనా అంటూ వ్యాఖ్యానించారు. ఇటు రేవంత్‌రెడ్డి, అటు రఘునందన్‌రావు ఇద్దరు కూడా సిద్దిపేట అభివృద్ధిని ఓర్వలేని వాళ్లేనని, అందుకే ఇరు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

ఒకరి మరణం.. ఎందరికో శాపం!



- 'వీ మార్ట్' అధినేతను నమ్మి డబ్బు ముట్టజెప్పి..
- 7 నెలల క్రితం ఆయన ఆకస్మిక మృతితో రోడ్డున పడ్డ బాధితులు
- వారి వేధింపులు తాళలేక తాజాగా సహ వ్యాపారి బలవన్మరణం
- సిద్దిపేట జిల్లాలో కలకలం

దుబ్బాక, మే 3: వీమార్ట్ అధినేత, దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట గ్రామానికి చెందిన తడ్కమడ్ల విశ్వంగుప్తా ఉదంతం రేపిన కలకలం ఎందరో వ్యాపారులు, చిన్న సన్నకారు రైతులకు.. కార్మికులకు శాపంగా మారడంతో పాటు నేడు ఓ రైస్ మిల్లర్ ఆత్మహత్యకు కారణమైనట్లు జిల్లాలో జోరుగా చర్చ జరుగుతోంది. చిన్న వ్యాపారం నుంచి మొదలై జిల్లాలోనే తిరుగులేని వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన విశ్వంగుప్తా తాను మోసపోవడంతో పాటు ఎందరినో రోడ్డుపాలు చేసినట్లు చెబుతున్నారు. తాజాగా అతని సహ వ్యాపారి అదే గ్రామానికి చెందిన కాచం నాగార్జున(57) అనే రైస్ మిల్లర్ తన రైస్ మిల్లులోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించగా.. విశ్వంగుప్తా ఉదంతం మరోసారి తెరపైకి వచ్చింది..

ఎవరీ విశ్వంగుప్తా

దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేట గ్రామానికి చెందిన తడ్కమడ్ల విశ్వంగుప్తా సొంత గ్రామంలో 33 ఏళ్ల క్రితం చిన్న కిరాణదుకాణంతో వ్యాపారం ప్రారంభించారు. తర్వాత రైస్‌మిల్ ఏర్పాటు చేశారు. ఆ రైస్‌మిల్ గ్రామంతో పాటు నియోజకవర్గ నాయకుల లావాదేవీలకు వేదికగా మారింది. పనికి ఆహార పథకం బియ్యాన్ని రీసైక్లింగ్ చేసినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. డబ్బుతో పాటు పరపతి పెరగడంతో తన వ్యాపారాన్ని రియల్ ఎస్టేట్ వైపు తిప్పారు. అదే క్రమంలో నిజాం షుగర్స్‌లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న సుమారు 25 మంది కార్మికులు సంస్థ నుంచి వచ్చిన డబ్బును విశ్వంగుప్తా వద్దే దాచుకున్నారు. వడ్డీ ఇస్తుండటంతో మరింత మంది తమ పిల్లల పెళ్లిళ్లకు, ఇళ్లు కట్టుకవడానికి, ఇతర అవసరాలకు దాచుకున్న డబ్బును విశ్వంగుప్తాకు అప్పుగా ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆయన సిద్దిపేటలో ఎనిమిదేళ్ల క్రితం వీ మార్ట్ పేరిట సూపర్ మార్కెట్ ప్రారంభించారు. వాటిని గజ్వేల్, నర్సాపూర్‌తో పాటు పలు జిల్లాల్లో విస్తరించేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రజల్లో ఇంకా నమ్మకం పెరడగంతో కోట్లాది రుపాయాలు వచ్చిపడ్డాయి. ఈ క్రమంలో దుబ్బాక నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడితో కలిసి తన వ్యాపార సామ్రాజ్యాన్ని ముంబై వరకు విస్తరించాలని భావించాడు. దుబ్బాకకు చెందిన ఆ నాయకుడు విశ్వంగుప్తాతో ముంబైలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టించాడు. వందల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టగా.. అక్కడి రియల్ మాఫియా చేతిలో మోసపోయినట్లు ప్రచారం జరిగింది.

విశ్వంగుప్తా సంచార జాతుల నుంచి కూడా అప్పులు తీసుకోవడంతో వారంతా తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయడం మొదలు పెట్టారు. అతడి సామ్రాజ్యం కూలిపోతుందన్న సమాచారంతో అతడికి డబ్బులు ఇచ్చిన వారంతా ఒత్తిడి మొదలు పెట్టారు. అన్ని వర్గాల నుంచి ఒక్కసారిగా ఒత్తిడి పెరగడం.. వేధింపులు పెరిగాయి. అయితే, విశ్వంగుప్త ఏడు నెలల క్రితం ఆకస్మాతుగా చనిపోయారు. దీంతో రెక్కల కష్టాన్ని తమ భవిష్యత్తు కోసం దాచుకున్న వందలాది మంది రోడ్డున పడ్డారు. కొందరు వ్యాపారులు అందిన కాడిన వారి కుటుంబం నుంచి వసూలు చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. ముంబైలో విశ్వంగుప్తా పెట్టిన పెట్టుబడులు తిరిగి ఇచ్చామని అక్కడి వారు చెబుతుండగా.. తమకు డబ్బులు రాలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే, తాజాగా ఆత్మహత్య చేసుకున్న కాచం నాగార్జున సైతం విశ్వంగుప్తాకు అప్పు చేసి మరీ వడ్డీకి ఇచ్చినట్లు సమాచారం. విశ్వంగుప్తా చనిపోవడంతో మరో సారి తమకు ఇలా జరగవద్దని కాచం నాగార్జునకు అప్పులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి పెంచారు.

అప్పుల బాధతో రైస్ మిల్లర్ ఆత్మహత్య

అప్పుల బాధతో ఓ రైస్ మిల్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లచ్చపేటలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కాచం నాగార్జున(57) తన మహేశ్వరీ రైస్ మిల్‌లోనే ఉరి చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. కాచం నాగార్జున గ్రామంలో రైస్ మిల్ నడుపుతున్నారు. అయితే, ఆయన ఏడు నెలల క్రితం మరణించిన విశ్వంగుప్తా (రైస్‌మిల్లర్)కు, అతని సోదరుడికి పెద్ద మొత్తంలో అప్పు ఇచ్చినట్లు సమాచారం. అయితే, ఆ డబ్బులు తిరిగి రాకపోవడం, అప్పుల వారి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతోనే నాగార్జున ఆత్మహత్య చేసుకునట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన నాగార్జునకు భార్య అశ్వినీ, కుమారుడు మణికంఠ ఉన్నారు.



నాగార్జున (ఫైల్)

ఆత్మహత్యకు ముందు వాయిస్ మెసేజ్

తన మరణానికి తన సహ వ్యాపారి విశ్వం సోదరుడు కారణమంటూ రైస్ మిల్లర్ నాగరాజు తాను ఆత్మహత్య చేసుకోవడానికి పది నిమిషాల ముందు ఓ వ్యాపారికి వాయిస్ మెసేజ్ పంపినట్లు తెలిసింది. విశ్వం కుటుంబానికి, కాచం నాగార్జున కుటుంబానికి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం జరుగుతున్నట్లు సమాచారం. రెండు నెలల క్రితం నాగార్జున ఆత్మహత్యా యత్నం చేశారు. కుటుంబ సభ్యులు కొంత సెటిల్ చేయగా.. ఇంకా అప్పుల వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు వెలవెల

- సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తగ్గిన సందడి
- రియల్ దందా కుదేలవడం, ఎన్నికల కోడ్ అమలే కారణం

సిద్దిపేట క్రైం, మే 3 : సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు తగ్గముఖం పట్టాయి. ఆరు నెలల క్రితంతో పోల్చుకుంటే సగానికి సగం పడిపోయాయి. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట అర్బన్, రూరల్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఆయా కార్యాలయాల్లో మునపటి సందడి కనిపించడం లేదు.

రిజిస్ట్రేషన్లు వాయిదా

జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తగ్గుముఖం పట్టడానికి పార్లమెంటు ఎన్నికలు, భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడం వంటివి కారణాలుగా కనబడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లా మొత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. గతంలోనే భూమి ధరలను వ్యాపారులు అధికంగా పెంచేశారు.



బోసిపోతున్న సిద్దిపేటరూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

సామాన్యులు భూములు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండాపోయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో డబ్బు రవాణా ఇబ్బందిగా మారిపోయింది. రూ.50,000 కన్నా ఎక్కువ నగదు రవాణా చేస్తే జిల్లాలో ఉన్న తనిఖీ కేంద్రాల వద్ద పోలీసులు పట్టుకుంటున్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌లను వాయిదా వేసుకుంటున్నారు.

ఐదు నుంచి పది రిజిస్ట్రేషన్లే!

సిద్దిపేట అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సాధారణ రోజుల్లో నిత్యం 40 నుంచి 60 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, ప్రస్తుతం 10 నుంచి 15 డాక్యుమెంట్లు మాత్రమే అవుతున్నాయి. సిద్దిపేట రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సాధారణ రోజుల్లో 10 నుంచి 15 డాక్యుమెంట్లు అయ్యేవి, ఐదు నుంచి 10 డాక్యుమెంట్లు అవుతున్నాయి. దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, గజ్వేల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సాధారణ రోజుల్లో సుమారుగా 20 నుంచి 30 డాక్యుమెంట్లు పూర్తయ్యేవి. ప్రస్తుతం వీటి సంఖ్య సగానికి సగం పడిపోయాయి. దీంతో సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా తగ్గిపోయింది.

మార్టిగేజ్ డాక్యుమెంట్లే ఎక్కువ

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రుణాల కోసం చేసే మార్టిగేజ్ డాక్యుమెంట్లే ఎక్కువ జరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో భూముల రిజిస్ట్రేషన్లు అంతగా చేయడం లేదు. దీంతో సేల్ డీడ్ డాక్యుమెంట్లు తగ్గాయి. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గుతూ వచ్చింది. అప్పటి నుంచి జిల్లాలో అయ్యే రిజిస్ట్రేషన్లలో 80శాతంపైగా మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లే ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండడంతో ఈ డాక్యుమెంట్లు కూడా తగ్గుముఖం పట్టాయి. పార్లమెంట్ ఎన్నికల అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని రియల్ వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సిద్దిపేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం

కనుల పండువగా వేంకటేశ్వర కల్యాణం


గజ్వేల్‌లోని వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం

గజ్వేల్‌టౌన్, మే 3: గజ్వేల్ పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో వేంకటేశ్వర కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణం, సాయంత్రం సాయమారాధన, నిత్య పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం శ్రీసీతారామ ఉమామహేశ్వరస్వామి నిత్య పూజ కార్యక్రమాలు, పొన్నసేవ, నందివాహన సేవ, భద్రకాళి పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ఉమామహేశ్వర స్వామిని విశేష అలంకరణ చేసి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

రాంసాగర్‌లో సీతారాముల రథోత్సవం

రాయపోల్, మే 3: మండలంలోని రాంసాగర్‌లో జరుగుతున్న రామాలయ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. రాంసాగర్ గ్రామ వీధుల్లో సీతారాముల రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తూప్రాన్, మే 3: తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో జరిగిన హత్య సంఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ పోలీసులు తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మీనాజిపేటకు చెందిన స్నేహితులు కీసరి ఆనంద్(50), బాణాపురం యాదగిరి గతనెల 22న తూప్రాన్‌కు వచ్చారు. మార్గమధ్యలో తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో యాదగిరి దాడిలో ఆనంద్ గాయపడి, ఈనెల 1 మృతిచెందాడు. ఆనంద్ హత్య సంఘటనలో నిందితుడు మీనాజీపేటకు చెందిన బాణాపురం యాదగిరి (44)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఉపాధి కూలీలకు ఇబ్బందులు ఉండొద్దు

- నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి
- అధికారులను ఆదేశించిన సీఆర్‌డీ అధికారి మమత


నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మునిపల్లి, మే 3: ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలకు పనుల వద్ద ఇబ్బందులు ఉండొద్దని కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి మమత సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పెద్దగోపులారం, బుదేరా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను, నర్సరీలను ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ మనీకుమార్, అంబుడ్స్‌మెన్ జిల్లా అధికారి బోజిరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో కూలీలకు నీరు, ఫస్ట్‌ఎయిడ్, టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. అలాగే నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా నీరందించాలన్నారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీల్లో మొక్కలు తాజాగా ఉన్నాయని అధికారులను అభినందించారు. ఆమె వెంట ఏపీవో యాదగిరి, ఈసీ స్టీఫెన్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని ఒకరు మృతి


సత్యనారాయణ (ఫైల్)

మనోహరాబాద్, మే 3: ధాన్యం కుప్పను ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండలం పాలాట గ్రామం వద్ద గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన సుంచు సత్యనారాయణ(45) పోతారం శివారులోని తన పొలం వద్దకెళ్లి తిరిగి పాలాట గ్రామం మీదుగా ఇంటికి వస్తున్నాడు. కాగా గ్రామ శివారులోని బీటీరోడ్డుపై రైతు బొల్లెబోయిన నర్సింహులు ధాన్యం కుప్పలు పోశాడు. ఆ ధాన్యం కుప్పను ఢీకొని సత్యనారాయణ కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు చూసి తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు బొల్లెబోయిన నర్సింహులుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..

జహీరాబాద్, మే 3: బావిలో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బోలీతండాకు చెందిన బోజానాయక్(58) ఈనెల 3న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. కాగా శుక్రవారం గ్రామ సమీపంలోని బావిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడు..


డోరే ప్రేమ్ (ఫైల్)

న్యాల్‌కల్, మే 3: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన న్యాల్‌కల్ మండలంలోని గుంజోటీ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం గ్రామానికి చెందిన డోరే ప్రేమ్(18) ఇంట్లో బల్బును మారుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని బీదర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అత్తింటికి వెళ్లడం ఇష్టం లేక తల్లి, ముగ్గురు పిల్లలు ఆదృశ్యం


అదృశ్యమైన తల్లి, పిల్లలు(ఫైల్)

తూప్రాన్, మే 3: అత్తింటికి వెళ్లడం ఇష్టం లేక తల్లి, ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన వడ్ల పవన్ 13 ఏళ్ల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి గ్రామానికి చెందిన అర్చన(27)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కార్తీక్(10), అక్షయ(6), ఈశ్వర్(4) సంతానం. ఐదేళ్లుగా తూప్రాన్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కిష్టాపూర్ గ్రామంలో పవన్ కుటుంబీకులకు రెండు ఇళ్లు ఉండగా, ఒక ఇంట్లో ఉండేందుకు నిర్ణయించారు. ఆ ఇంట్లో బాతురూం లేకపోవడంతో నిర్మాణం చేస్తే పవన్ తల్లిదండ్రులు ఆ ఇంట్లోకి వెళ్లేందుకు నిర్ణయించారు. తల్లిదండ్రులు నివాసముండే ఇంట్లోకి వెళ్లేందుకు నిర్ణయం తీసుకోవడంతో తూప్రాన్‌లో ఉంటానని భార్య గొడవ చేసింది. గురువారం బాత్‌రూం నిర్మాణం చేసేందుకు పవన్ ఇటుక, సిమెంట్, మేస్త్రీ గురించి ఫోన్‌లో మాట్లాడగా భార్య అర్చన విన్నది. దాంతో ఇంట్లో పవన్ పడుకోగా.. ముగ్గురు పిల్లలను తీసుకునివెళ్లిపోయింది. రాత్రివరకు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

సీడ్ కంపెనీలో అగ్ని ప్రమాదం


వేస్టేజ్‌ను బయటకు తీసుకొస్తున్న కార్మికులు

తూప్రాన్, మే 3: తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని ఓ సీడ్ కంపెనీలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులో ఫోలైన్ మొక్కజొన్న సీడ్ కంపెనీ ఉంది. సీడ్ కంపెనీలో శుక్రవారం ఉదయం వేస్టేజ్ నిలువ చేసిన ప్రదేశంలో షాట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు వెంటనే గుర్తించి అప్రమత్తమై మంటలను ఆర్పివేస్తే, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. అగ్నిమాపక యంత్రాలు వచ్చేవరకే కార్మికులు మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది.

పెళ్లిరోజే.. అనంతలోకాలకు..

● మరొకరికి తీవ్ర గాయాలు


వెంకటేశం(ఫైల్)

జగదేవ్‌పూర్, మే 3: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేశం(45) అనే వ్యక్తి ప్రజ్ఞాపూర్‌లో బార్, రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం అతడి పెళ్లి రోజు కావడంతో భార్య పిల్లలతో కలిసి గ్రామంలోని శివాలయంలో ఉదయం పూజలు చేశాడు. అనంతరం 11 గంటల సమయంలో బైక్‌పై ప్రజ్ఞాపూర్‌కు బయలుదేరాడు. తిగుల్ గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న బైక్ వేగంగా వెంకటేశం బైక్‌ను ఢీకొట్టింది. కిందపడిన అతడి తలకు తీవ్రగాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో తిగుల్ నుంచి గణేష్‌పల్లి వైపు వెళ్తున్న నర్సింహులు అనే వ్యక్తి ఆ రెండు బైకులను ఢీకొని కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య అనిత, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

సిద్దిపేట క్రైం, మే 3: సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు చౌరస్తాలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శ్రీసుధా వెంకటరామారావు (58) సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ, హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట పట్టణంలో ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణానికి సివిల్ ఇంజనీర్‌గా పని చేయడానికి వచ్చి, మహాశక్తి నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. అతడు బైక్‌పై గురువారం రాత్రి పనిమీద మహాశక్తినగర్ నుంచి వెళ్తూ, హౌసింగ్ బోర్డు చౌరస్తా దాటుతుండగా పాత బస్టాండ్ నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరం

● ఐదుగురు ముఖ్యమంత్రులతో పనిచేశా
● నా నిజాయితీకి ప్రజలే సాక్ష్యం
● బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి


పటాన్‌చెరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి


కౌడిపల్లి: రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

పటాన్‌చెరు, మే 3: రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లాలో నిర్మించిన ప్రాజెక్టులను తప్పుపడుతూ తనపై సీఎం రేవంత్‌రెడ్డి నిందలు మోపడం దురదృష్టకరమని బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి తనపై అభ్యంతరమైన వ్యాఖ్యలు చేసి తనస్థాయిని తగ్గించుకున్నారని అన్నారు. ఐదురుగు సీఎంలతో పార్టీలకతీతంగా ఆయా ప్రభుత్వాల హయాంలో ప్రజలకు సేవ చేశాననే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఎవరి వద్ద పనిచేసినా తనను ఎవరూ శంకించలేదన్నారు. పేదల సంక్షేమం కోసం చేసే ప్రయత్నాలతో తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించానే తప్ప ఎక్కడా తప్పు చేయలేదన్నారు. ఆనాడు సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయుకులసాగర్ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం కావడం సీఎం రేవంత్‌రెడ్డికి ఇష్టం లేదన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు దేశంలో ఎక్కడా లేనిస్థాయిలో నష్టపరిహారం అందించి పునరావాసం కల్పించామని పేర్కొన్నారు. ప్రాజెక్టులతో నేడు జిల్లాలో లక్షలాది ఎకరాల భూమి సాగులోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు కాని ఆరుగ్యారెంటీల గురించి మాట్లాడకుండా చవకబారు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా స్వరూపాన్ని మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌ది అన్నారు. అందుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తమ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. సీఎం కేసీఆర్, హరీశ్‌రావుల బస్సుయాత్రకు, రోడ్‌షోలకు వస్తున్న జనాదరణ చూసి సీఎం రేవంత్‌రెడ్డికి మైండ్‌బ్లాంక్ అవుతోందన్నారు. ప్రజల్లో మార్పు స్పష్టంగా వచ్చిందని, కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోవడంతో మరో నాటకానికి తెరతీస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఒట్టు వేస్తే ఓట్లు వస్తాయా?: ఎమ్మెల్యే

కౌడిపల్లి/కొల్చారం, మే 3: రుణమాఫీ చేయమంటే ఒట్టు వేస్తూ కాంగ్రెస్ పబ్బం గడుపుకుంటుందని, ఒట్టు వేస్తే ఓట్లు వస్తాయా అని ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో వెంకట్రామారెడ్డి, మాజీ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. కొల్చారం మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే సునితారెడ్డి అధ్యక్షతన కార్నర్ మీటింగ్ జరిగింది. కొల్చారంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి: పద్మారెడ్డి

పాపన్నపేట, మే 3: ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పాపన్నపేటలో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

రామచంద్రాపురం, మే 3: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పుష్పనగేష్, వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణితరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెల్లాపూర్, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి పాల్గొన్నారు.

తండ్రికి తోడుగా..

కొండపాక, మే 3: కొండపాక మండలం సిరసనగండ్ల, గిరాయిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కుమారుడు సుప్రీత్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మద్దతు

తూప్రాన్, మే 3: తూప్రాన్ మండలం ముదిరాజ్ సంఘం నాయకులు బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతు తెలిపారు. శుక్రవారం తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జిన్న రాజు అధ్యక్షతన సమావేశం ఈ మేరకు తీర్మానం చేశారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్, సంఘ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ నేతల ప్రచారం

ములుగు, మే 3: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మద్దతుగా జోరుగా ప్రచారాలు సాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి శుక్రవారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

గజ్వేల్, మే 3: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


రామచంద్రాపురంలో ఇంటింటి ప్రచారంలో వెంకట్రామారెడ్డి సతీమణి, బీఆర్‌ఎస్ నేతలు


ములుగు: లక్ష్మక్కపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బట్టు అంజిరెడ్డి

●మర్కుక్, మే 3: మర్కుక్ మండలం పాతూరు గ్రామంలో ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి మండల కేంద్రం, తిప్పారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

●**దౌల్తాబాద్:** తిర్మలాపూర్ గ్రామంలో జడ్పీటీసీ రణంజ్యోతి శ్రీనివాస్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దొమ్మాటలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రహీమొద్దీన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలోని పలుగుగడ్డ, మాందాపూర్, మునిగడప గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఫేక్ వీడియోలతో దేశసామరస్యానికి భంగం

● తెలంగాణలో డబుల్ డిజిట్ సాధిస్తాం ● కర్ణాటక, తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి

జహీరాబాద్, మే 3 : నరేంద్ర మోదీ పాలనను జీర్ణించుకోలేక రాజకీయ కుట్రలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ నాయకులు అదృశ్యవ్యక్తులతో చేతులు కలిపి ఫేక్‌వీడియోలు సృష్టించి ప్రజల్లో అలజడి రేపేలా చేస్తున్నారని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల బీజేపీ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఫేక్ వీడియోలతో కాంగ్రెస్ పార్టీ దేశ సామరస్యానికి భంగం కలిగిస్తోందని ధ్వజమెత్తారు. జహీరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మత విబేధాలను సృష్టిస్తున్నామంటూ బీజేపీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజలు ఓట్లతో గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన బాగలేదని, కాంగ్రెస్‌ను తెచ్చుకున్న ప్రజలకు ప్రస్తుతం పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లైందన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. సాధ్యంకాని పనులను సైతం గడిచిన పదేళ్లలో నరేంద్రమోదీ సుసాధ్యం చేసిన గొప్ప మహనీయుడని ఆయన కొనియాడారు. ఎవరెన్ని చెప్పిన తెలంగాణలో డబుల్ డిజిట్ స్థానాలను సాధిస్తామని ధీమాను వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రిజర్వేషనకు వ్యతిరేకం కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక, తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి

దేశాభివృద్ధి.. సంక్షేమం కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలి

● రోడ్‌షోలో ఎమ్మెల్యే రాజాసింగ్

జిన్నారం/గుమ్మడిదల, మే 3: రాష్ట్రంలో పదేళ్లలో జరిగిన అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అధిక భాగం ఉన్నదని, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటువేసి గెలిపించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్‌పల్లి నుంచి జిన్నారం, గడ్డపోతారంలో నిర్వహించిన రోడ్‌షోలో ఎమ్మెల్యే రాజాసింగ్, అభ్యర్థి రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేస్తే వృథా అన్నారు. నిరంతరం ప్రజల తరఫున గొంతుక వినిపించే రఘునందన్‌రావును ఎంపీగా గెలిపించి, పార్లమెంట్‌కు పంపాలని కోరారు. గుమ్మడిదల మండలంలో అన్నారం నుంచి గుమ్మడిదల వరకు బైక్ ర్యాలీలో రాజాసింగ్, రఘునందన్‌రావు పాల్గొని ప్రసంగించారు.

●**సిద్దిపేట క్రైం:** బీజేపీకి ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

●**మెదక్ అర్బన్:** మెదక్ జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు సతీమణి మాధవనేని మంజుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ పాల్గొన్నారు.



జిన్నారంలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్, పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు

●**హత్నూర:** బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బుచ్చేంద్ర మాదిగ ఆధ్వర్యంలో హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. అలాగే బోర్పట్ల గ్రామంలోని భీముని చెరువులో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలతో బీజేపీ బోర్పట్ల శక్తి కేంద్రం ఇన్‌చార్జి కమలాకర్ సమావేశమై బీజేపీకి ఓటేయాలని కోరారు.

●**మాసాయిపేట:** మాసాయిపేట మండలంలోని పోతనపల్లి, చెట్ల తిమ్మాయిపల్లితో పాటు పలు గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ఎమ్మార్పీ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి, చెట్లపల్లి యాదగిరి, బాబు మాదిగ ప్రచారం నిర్వహించారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్ మండలం రామచంద్రాపురంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ రమణారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు.


మెదక్‌లోని 11వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న రఘునందన్‌రావు సతీమణి మాధవనేని మంజుల

●**కొల్చారం:** కొల్చారం మండలంలోని అంసాన్‌పల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు శుక్రవారం మోదీ కటౌట్‌తో ఉపాధిహామీ కూలీల దగ్గరికి వెళ్లి రఘునందన్‌రావుకు ఓటేయాలని అభ్యర్థించారు.

●**వెల్దుర్తి:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీజేపీ మండల ఇన్‌చార్జి బుచ్చేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వెల్దుర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులుతో కలిసి మాట్లాడారు. శేరి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపాయలతండా, ఆరేపల్లి, గొట్టి ముక్కుల, రాఘవాణితండా, పెద్దశంకరంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్, మే 3: 2024-25 సంవత్సరంలో మూడేళ్లపాటు టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు ఒడిషా రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వారు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో తెలంగాణకు సంబంధించి 9 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 16 జూలై 2024 నాటికి బీసీ జనరల్ వర్గానికి చెందినవారు 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయస్సు లోపు, ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు 15 నుంచి 25 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి సూచించారు. పూర్తి వివరాలకు 9902096848 నెంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం, వ్యక్తి అరెస్ట్

సిద్దిపేట క్రైం, మే 3: ప్రముఖ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని నమ్మించి మోసం చేసిన ఓ వ్యక్తిని సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన మహిళ ఓ లింక్‌లో తన ప్రొఫైల్ అప్‌లోడ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాకు చెందిన సందూరు అరవింద్ అనే వ్యక్తి ఫోన్‌చేసి కంపెనీలో బ్యాక్ డోర్ జాబ్స్ ఉన్నాయని చెప్పాడు. అది నమ్మిన సదరు మహిళ నిందితుడు చెప్పిన విధంగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఐదారు విడదతలుగా రూ.16,75,750 లక్షలు పంపించింది. అనంతరం ఆ నెంబర్‌కు ఫోన్‌చేయగా స్విచాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన బాధితురాలు జాతీయ సైబర్ సెల్ నెంబర్ 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసింది. తర్వాత సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చింది. సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బందితో కలిసి కేసు పరిశోధన ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీపీ తెలిపారు.


మాట్లాడుతున్న సీపీ

తల్లిని చంపిన కుమారుడికి రిమాండ్

మర్కుక్, మే 3: తల్లిని చంపిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన నరసింహులుకు భార్య శిరీష, తల్లి భారతమ్మ ఉన్నారు. గతనెల 27న కుటుంబ సమస్యల విషయంలో తల్లి, భార్య గొడవపడుతున్నారు. అంతలో అక్కడికి వచ్చిన నరసింహులు తల్లిని ఇష్టమొచ్చినట్లు చేయి పట్టి గట్టిగా లాగాడు. పక్కనే ఉన్న బండరాయికి తల తగిలి భారతమ్మ తీవ్రంగా గాయపడింది. అయితే అదేరోజు ఆస్పత్రికి తీసుకెళ్లకుండా.. మరుసటి రోజు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించాడు. పరిస్థితి విషమించి గతనెల 29న మృతిచెందింది. ఈ ఘటనపై మర్కుక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, నరసింహులును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఔర్ ఏక్ బార్.. నరేంద్రమోదీ సర్కార్

● బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

బాన్సువాడటౌన్, మే 3: నేడు దేశ ప్రజలంతా ఔర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం రాత్రి బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ హయాంలో భారతదేశం విశ్వఖ్యాతి గాంచిందన్నారు. నేడు ప్రపంచ దేశాల సరసన భారతదేశం నిలబడిందంటే అది కేవలం మోదీతోనే సాధ్యమైందన్నారు. జహీరాబాద్ ఎంపీగా తనను పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, నాయకులు ఉన్నారు.

మోదీ సహకారంతో అభివృద్ధి చేస్తా..

బీర్కూర్, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, సాయికిరణ్, సాయిలు, మాధవ్‌యాదవ్ పాల్గొన్నారు.


బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

బీబీపాటిల్‌కు ఓటువేస్తే మోదీకి వేసినట్టే

కామారెడ్డిటౌన్, మే 3: జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని రాజారెడ్డిగార్డెన్‌లో ఏర్పాటుచేసిన కామారెడ్డి రూరల్, రాజంపేట బీజేపీ మండల నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.


కామారెడ్డి టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

బీజేపీతోనే అభివృద్ధి

దోమకొండ, మే 3: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రమణారెడ్డి దోమకొండ సబ్‌స్టేషన్ వద్ద నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించి కొత్త బస్టాండ్, అంగడి బజార్, శివరాంమందిర్, బురుజు, పలుగడ్డ, మసీదు పాత బస్టాండ్ మీదుగా పెద్దమ్మ ఫంక్షన్ హాల్‌కి ర్యాలీగా చేరుకున్నారు. పెద్దమ్మ ఆలయంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు.

మాడ్గి చెక్‌పోస్టు వద్ద రూ.99 వేలు పట్టివేత

జహీరాబాద్, మే 3: మొగుడంపల్లి మండంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.99 వేలు పట్టుబడ్డాయని చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సుధాకర్ కారులో రూ.99వేలు తీసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మాడ్గి చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డాయన్నారు. వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేని కారణంగా స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ వివరించారు.


తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేష్, పోలీస్ సిబ్బంది

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వెల్దుర్తి, మే 3: అనుమతులు లేకుండా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నవతగౌడ్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ హల్దీవాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

రెండు గంటలు నరకయాతన

● రాజీవ్ రహదారిపై ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ, డ్రైవర్‌కు గాయాలు


డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సిద్దిపేట క్రైం, మే 3: సిద్దిపేట పట్టణ శివారులోని మందపల్లి స్టేజీ సమీపంలో రాజీవ్ రహదారిపై హైవే అథారిటీ వారు డివైడర్ పై ఉన్న చెట్లకు వాటర్ ట్యాంక్ సహాయంతో నీళ్లను పోస్తూ కరీంనగర్ వైపు మెల్లగా వెళ్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వాటర్ ట్యాంక్ వెనకభాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సైదులు క్యాబిన్‌లో ఇరుక్కుని రెండు గంటల పాటు ఇబ్బందిపడ్డాడు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో బయటకుతీశారు. అనంతరం చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం

● యువతి మృతి


మౌనిక(ఫైల్)

వర్గల్, మే 3: పెళ్లి ఇష్టం లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన రాయన్న మల్లేశం కూతురు మౌనిక(21)ను యాదాద్రి-భువనగిరి జిల్లా గంధమల్ల గ్రామానికి చెందినవారు గతనెల 27న పెళ్లి చూపులకు వచ్చి వెళ్లారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక మౌనిక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తా చాటిన విద్యార్థినులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు, ప్రిన్సిపాల్ ఉమాశశి

గజ్వేల్, మే 3: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు జిజ్ఞాస పోటీల్లో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీలు-2024లో, ఫిజిక్స్ విభాగంలో డాటా ట్రాన్స్‌మిషన్ యూజింగ్ లై-ఫై అనే అంశంలో అధ్యాపకురాలు పి.సౌజన్య పర్యవేక్షణలో విద్యార్థినిలు సాత్విక, మానస, పూజ, నమిత, పావని, సారక్కలు ప్రథమ బహుమతి పొందారు. తెలుగు విభాగంలో తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఆట-పాట అనే అంశంపై అధ్యాపకురాలు అనిత పర్యవేక్షణలో నీరజ, స్రవంతి, నవ్య, కావ్య, అనూషాలు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతిని పొందారు. రాజ్‌భవన్ రోడ్డులోని సంస్కృతిభవన్‌లో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా ఫిజిక్స్ విభాగం విద్యార్థినులు రూ.30వేల నగదు, ప్రశాంసాపత్రాలు, తెలుగు విభాగం విద్యార్థినిలు రూ.12వేల నగదు, ప్రశంసాపత్రాలను పొందారు. వారిని ప్రిన్సిపాల్ ఉమాశశి అభినందించారు.

తిప్పారంలో హోమ్ పోలింగ్

కుకునూరుపల్లి, మే 3: శుక్రవారం కుకునూరుపల్లి మండల ఎన్నికల అధికారులు తిప్పారం గ్రామంలో హోమ్ పోలింగ్ నిర్వహించారు. గ్రామంలో ముగ్గురు ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాడు ప్రత్యర్థులు... నేడు మిత్రులు

- ప్రతీ ఎన్నికల వేళ చేర్యాలలో ఆసక్తికర పరిణామాలు

చేర్యాల, మే 2 : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరంటారు.. అందుకు జనగామ నియోజకవర్గ నేతలే నిదర్శనం. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాన అభ్యర్థులుగా పోటీపడినవారు మిత్రులుగా, మిత్రులుగా ఉన్న వారు వ్యతిరేకులుగా మారుతున్నారు. మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బెక్కల్ గ్రామానికి చెందిన నాగపురి రాజలింగం, ధూళిమిట్ట మండలానికి చెందిన మండల శ్రీరాములు రాజకీయ జీవితాలలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల మధ్య చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తినిగొల్పుతున్నాయి.

నాడు అసెంబ్లీ పోరులో ప్రత్యర్థులు

1962లో ఏర్పడిన చేర్యాల నియోజకవర్గం 2008లో కనుమరుగై జనగామలో విలీనమైంది. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నాగపురి రాజలింగం, టీడీపీ నుంచి మండల శ్రీరాములు పోటీ చేయగా, రాజలింగం 1600పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ జతకట్టిన క్రమంలో బీఆర్ఎస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నుంచి మండల శ్రీరాములు పోటీచేయగా, ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 ఉపఎన్నిక సమయంలో పొన్నాల వైశాలి కాంగ్రెస్ నుంచి పోటీ చేయడంతో నాగపురి రాజలింగం, మండల శ్రీరాములు ఆమెకు మద్దతుగా నిలిచి కొమ్మూరికి వ్యతిరేకంగా పావులు కదిపినప్పటికీ ఆయన విజయకేతనం ఎగరవేశారు. 2009 ఎన్నికలలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య ప్రత్యర్థులుగా పోటీ చేయగా పొన్నాల గెలిచాడు. 2014లో కొమ్మూరి బీజేపీ నుంచి పొన్నాలపై పోటీ చేయగా, 2018లో ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పొన్నాల లక్ష్మయ్యకు అండగా నిలిచారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కొమ్మూరికి దక్కడంతో పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరి వ్యతిరేకంగా వ్యవహరించారు. ఇదే సమయంలో నాగపురి రాజలింగం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి కొమ్మూరి కోసం పనిచే యగా, మండల శ్రీరాములు ప్రత్యర్థి పల్లాకు మద్దతుగా పనిచేశాడు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల సమయంలో మండల శ్రీరాములు బీఆర్ఎస్‌కు బైబై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. అంతే కాకుండా 2009, 2014 ఎన్నికల్లో ముత్తిరెడ్డి, పొన్నాల ప్రధాన ప్రత్యర్థులుగా పోటీ చే యగా, రెండు ఎన్నికల్లోనూ పొన్నాల ఓటమి చెందారు. 2018 ఎన్నికలో ముత్తిరెడ్డి, పొన్నాల కలిసిపోయి పల్లాకు పని చేశారు.



భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రోడ్‌షోలో కొమ్మూరి, నాగపురి, మండల (ఫైల్)

పార్లమెంటు ఎన్నికల్లోనూ..

2009లో భువనగిరి ఎంపీగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎన్నికైన సమయంలో పొన్నాల లక్ష్మయ్యతో పొసగక ఇద్దరి మధ్య వర్గ పోరు కొనసాగింది. 2014లో రాజగోపాల్‌రెడ్డి ఓటమి చెందగా, బీఆర్ఎస్ నుంచి బూర నర్సయ్యగౌడ్ గెలుపొందినప్పటికీ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డితో ఎంపీ ల్యాడ్స్ నిధులు, అధికారిక కార్యక్రమాల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నాయి. 2019ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ చేయడంతో పొన్నాల లక్ష్మయ్య ఆయనతో కలిసి పనిచే శారు. ఒక్కో ఎన్నికల సమయంలో ఇలా ఒక్కో నేత ఎడ మొహం, పెడమోహంగా ఉంటున్నా మరో ఎన్నికల నాటికి జతకడుతున్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కొమ్మూరి, నాగపురి, మండల కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. చేర్యాల ప్రాంత రాజకీయాలను మలుపుతిప్పిన ఈ ముగ్గురు నేతలు నాడు శత్రువులుగా ఉండి, ప్రస్తుతం ఒకేగూటి పక్షులుగా తిరగడం ఆసక్తిరేపుతోంది.



ముత్తిరెడ్డి, పొన్నాల ఆలింగనం (ఫైల్)

చెట్ల కొమ్మల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, మే 3 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేపచెట్టుకు అతుక్కున్న విద్యుత్ తీగల్ని సిబ్బంది సరిచేసి విద్యుత్ సరఫరాలో ఏలాంటి అంతరాయం లేకుండా చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వేపచెట్టుకు విద్యుత్ తీగలు అతుక్కుపోయాయి' కథనానికి విద్యుత్‌శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు ఉదయం విద్యుత్ సిబ్బంది వేపచెట్టు కొమ్మల్ని తొలగింపజేసి, కొమ్మల్ని తొలగించి విద్యుత్ లైన్ సరిచేయడంతో వాహనదారులతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కోహెడలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

కోహెడ, మే 3: మండల కేంద్రంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బొయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పేర్యాల దేవేందర్ రావు, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, బండ వెంకటస్వామి, లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, మాజీ ఉపసర్పంచులు యాద అశోక్, లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ మంద రాజయ్య, మండల యువత అధ్యక్షుడు జాలిగం శంకర్, ముంజ సంపత్, సుకుమార్‌రావు, ఉల్లెంగల లింగచారి, గోవిందు సురేష్, రాకేష్, గడ్డం మహేష్, కిష్టస్వామి, రేవోజు శరత్, జగదీష్, జాన్, తలారి నర్సయ్య ఉన్నారు.

కులాల పేరిట, మతాల పేరిట రాజకీయాలు చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి

- సీపీఎం నాయకులు

దూళిమిట్ట, మే 3: కులాల పేరిట, మతాల పేరిట రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పి, సీపీఎం అభ్యర్థి జహాంగీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, గోద్సుబార్ల భాస్కర్ కోరారు. శుక్రవారం మండలంలోని బెక్కల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయాలను వ్యాపారంగా మార్చి, ప్రజల సోమ్మును దోచుకుతింటున్న పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, పోతురెడ్డి రాజు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదు

- ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, మే 3: అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని, కాంగ్రెస్‌వి ఉద్దెర హామీలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామని శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. దేశంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన నియోజకవర్గం సిద్దిపేట నియోజకవర్గమన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అందుకే ఎన్నిసార్లు ఉపఎన్నిక వచ్చినా సిద్దిపేట ప్రజలు ఆయనను హక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. గురువారం సిద్దిపేటకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటలో ఏమి అభివృద్ధి చేస్తామని చెప్పకుండా, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై అవాకులు, చెవాకులు పేల్చడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాపయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, శారద రమేష్, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేష్, రాజలింగం పాల్గొన్నారు.

ఎండలతో జరభద్రం

టేక్మాల్, మే 3: వేసవి ఎండలకు వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టేక్మాల్ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కృతికారెడ్డి అన్నా రు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎండల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మే నేలలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా తాగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. మే నెలలో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారని తెలిపారు. ఈ వేసవిలో సాధారణంగా వడదెబ్బ, డీహైడ్రేషన్ వస్తాయని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు తప్పదని ఆమె వివరించారు. వడదెబ్బకు గురైన వారిలో నీటిశాతం తగ్గి, శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుందన్నారు. దీంతో గుండె, రక్తనాళాలు, కిడ్నీలు, లవణాలు దెబ్బతింటాయన్నారు. శరీరంలోని లవణాలు చెమట రూపంలో బయటకు వెళ్లడంతో మనిషి నీరసించి జ్వరం, వాంతులు, విరోచనాలతో తల తిరగడం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయన్నారు. వడదెబ్బ తగిలిన వారిని వెంటనే నీడలోకి తీసుకెళ్లాలన్నారు. చల్లటి నీటితో శరీరాన్ని తుడిచి శరీర ఉష్ణోగ్రతలు తగ్గేలా చేయాలని, సమస్య తీవ్రతను బట్టి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నీడ పట్టున ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, నీరసంగా ఉంటే ఓఆర్ఎస్, గ్లూకోజ్ కలిపిన నీటిని తీసుకోవాలన్నారు. ఇంటిలోనే కాచి చల్లార్చిన లీటర్ నీటిలో అరస్పూన్ ఉప్పు, ఆరు స్పూన్ల షుగర్ వేసి ఓఆర్ఎస్‌ను తయారు చేసుకోని నీరసంగా ఉన్నప్పుడు తీసుకోవచ్చన్నారు. వేపుడు పదార్థాలు టీ, కాఫీ, జంక్ పుడ్స్, ఆల్కహాల్ తగ్గించాలన్నారు. పిల్లలకు మెత్తని నూలు దుస్తులు ధరించాలని సూచించారు.

పల్లెలకూ పాకిన ఐపీఎల్ క్రికెట్ ఫీవర్

కల్హేర్, మే 3: ఐపీఎల్ క్రికెట్ ట్రెండ్ పల్లెలకూ పాకింది. మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వారు అధిక సంఖ్యలో టికెట్లు బుక్ చేసుకుని హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్‌నేషనల్ క్రికెట్ స్టేడియానికి వెళ్లి మ్యాచ్‌లు తిలకిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఎస్ఆర్‌హెచ్ టీం ఉత్తమంగా రాణించడంతో గ్రామాల్లోని యువకులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకుని మరీ మ్యాచ్‌లు చూసేందుకు వెళ్తున్నారు. గురువారం జరిగిన మ్యాచ్‌కు కల్హేర్ మండల పరిధిలోని క్రిష్టాపూర్, మార్డి, మునిగేపల్లి తదితర గ్రామాలకు చెందిన యువకులు అధిక సంఖ్యలో ఉప్పల్ స్టేడియానికి వెళ్లి సందడి చేశారు.

కళాశాలలో జాబ్‌మేళా

జహీరాబాద్, మే 3: జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీకళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీంలీడర్ మానస్, కళాశాల ప్రిన్సిపాల్ చింతల హరికుమార్ తదితరులు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 56 మంది విద్యార్థులు పాల్గొనగా 24మంది విద్యార్థులు వివిధకంపెనీల్లో పని చేసేందుకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉద్యోగాలు వారికోసం వెతుక్కుంటూ వస్తాయని గుర్తు చేశారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా కంపెనీల అధికారులు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ కోఆర్డినేటర్ నర్సింలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికాసతరంగిణి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

జహీరాబాద్, మే 3: వేసవి దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో జహీరాబాద్ లోని ఎస్‌బీహెచ్ బ్యాంకువద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎంతో కొంత సేవాతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చలివేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రజల దాహార్తిని తీర్చిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో వికాసతరంగిణి సభ్యులు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, వాణి, సంధ్య, మంజులత, దత్తారెడ్డి, డా.శేషు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆట పాటలు నేర్పేది అంగన్‌వాడీ కేంద్రాలే

మునిపల్లి, మే 3: చిన్న పిల్లలకు విద్యతో పాటు ఆట పాటలు నేర్పించి దారి చూపేది అంగన్‌వాడీ కేంద్రాలేనని ఐసీడీఎస్ సీడీపీవో రేణు పటేట్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నచెల్మెడ అంగన్‌వాడీ సెంటర్‌లో యాన్యువల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, పంచాయతీ కార్యదర్శి అనిల్, అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'బండి గెలుపుతోనే సమస్యల పరిష్కారం'



బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన ప్రజా ప్రతినిధులు

కోహెడ, మే 3: బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ మరోసారి గెలిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పార్టీలో చేరిన పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ సమక్షంలో మండలంలోని చెంచెల్‌చెర్వుపల్లి ఎంపీటీసీ తూటి సుజాతబాపురెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కనుగారి నాగలక్ష్మీరాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొన్నాల శంకర్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం, మ్యాకల రజనీకాంత్ రెడ్డి, నరేష్, మైలరావు రాములు, రేవోజు రామాచారి, బిందెడ్డి అనిల్ రెడ్డి, పొన్నాల రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, మే 3: రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని మల్లారంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాల్లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ సదానందం, పలు గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏంపిడీవో

దూళిమిట్ట, ఏప్రిల్ 3: మండలంలోని కూటిగల్, రెడ్యానాయక్ తండాలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం పని ప్రదేశాలకు తొందరగా వెళ్లి, ఎండ రాకముందే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏంపీవో ఖాజా, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు



హుస్నాబాద్ టౌన్: అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

చేర్యాల/హుస్నాబాద్ టౌన్, మే 3: ఏఐవైఎఫ్ 65వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను శుక్రవారం చేర్యాలలో ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు గూడెపు సుదర్శన్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఏఐవైఎఫ్ అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మమత, వరలక్ష్మి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘ జెండాను ఎఐవైఎఫ్ మాజీ నాయకుడు జాగీర్ సత్యనారాయణగౌడ్ ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్ కుమార్, శ్రీనివాస్, గొర్ల రాజు, పెట్టుగడి గణేశ్, స్రవంతి, నాగరాజు, శివచైతన్య తదితరులున్నారు.

అంజన్ మరణం సీపీఐకి తీరనిలోటు

హుస్నాబాద్ టౌన్, మే 3: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ మృతి సీపీఐకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ భవన్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వనేష్, సత్యనారాయణ, అయిలేని సంజీవరెడ్డి, భాస్కర్, గూడ పద్మ, జనగామ రాజ్‌కుమార్, రంగయ్య, బాబు తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ బందోబస్తు

- ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్‌సింగ్

గజ్వేల్/జగదేవ్‌పూర్/ములుగు, మే 3: లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్‌సింగ్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీలో గల ఈవీఎంస్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని తెలియజేయడానికి 9177299185 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. వారితో గజ్వేల్ ఏఆర్వో, ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే పోలీసులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్ సింగ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్‌సింగ్ సూచించారు. ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలను పరిశీలించారు. ఆయనవెంట ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న రామేశ్వర్‌సింగ్

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి క్రైం, మే 3: అసంఘటిత రంగ కార్మికులంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. మేడేను పురస్కరించుకొని జిల్లా న్యాయసేవా సదన్‌లో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని ఆటో డ్రైవర్ యూనియన్, ఆటో డ్రైవర్లకు న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులందరికీ కార్మికశాఖ అనేక రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రతీ ఒక్క ఆటో డ్రైవర్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని, ఆటో డ్రైవర్ ఒకవేళ మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వ పథకాలు ఉన్నాయని వివరించారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎవరికైనా న్యాయ సహాయం, న్యాయపరంగా సలహాలు, సూచనలు కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

గులాబీ జెండానే తెలంగాణ ప్రజలకు అండ

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 3: రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణతో పాటు ప్రజల కష్టసుఖాలను తీర్చి అండగా నిలిచేది కేవలం గులాబీ జెండాయేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన చేర్యాల మండలం వేచరేణి, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్య పాలనలో వివక్షకు గురై దుర్భర జీవితాలు గడిపిన తెలంగాణ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించి భరోసా కల్పించింది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఆవశ్యమన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ గార్డెన్స్‌లో చేర్యాల పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, ఎంపీటీసీ తోట్ల బాలరాజు, కృష్ణవేణి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, జింకల పర్వతాలు, పబ్బోజు విజేందర్, గదరాజు యాదగిరి పాల్గొన్నారు.



చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రెవెన్యూ డివిజన్ కోరిక నెరవేస్తాం

- మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మద్దూరు, మే 3: ఎన్నికల అనంతరం ఈ ప్రాంత ప్రజల రెవెన్యూ డివిజన్ కోరికను నెరవేర్చడమే కాదు, డీలిమిటేషన్‌లో నియోజకవర్గాల పెంపు జరిగితే చేర్యాల నియోజకవర్గం అవుతుందని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మద్దూరు మండల కేంద్రంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతి కుటుంబ పార్టీని బొందపెట్టామన్నారు. ప్రజల్ని నమ్మించి వేల కోట్లు దోచుకున్న బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, మన కష్టాలు పోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో లేడన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో పల్లా డబ్బు సంచులు తీసుకువచ్చి పంచినట్టు పోలీసులకు ఆధారాలు లభించాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు మేక మల్లేశం, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మాజీ సొసైటీ వైస్‌చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కామిడి రమేష్‌రెడ్డి, ఖాజా ఆరీఫ్, షౌకత్ అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలి

- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

నారాయణఖేడ్, మే 3: మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆనంద్, చిరంజీవి పేర్కొన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ పారిశుధ్యపనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లిస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. కాస్మోటిక్ సామగ్రిని ప్రతి నెలా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, ప్రేమ్‌కుమార్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

అండగా ఉంటాం

గజ్వేల్, మే 3: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన శివరాములు(51) అప్పుల బాధతో వ్యవసాయ పొలం వద్ద ఆత్మహత్యకు పాల్పడగా, ఈ విషయం తెలిసిన ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు, నాయకులు రమేశ్‌గౌడ్, సాజిద్, భాస్కర్ తదితరులు ఉన్నారు.